బాధితులకు సత్వర న్యాయం


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే భరోసాను కల్పించి పోలీసులు అధికారులు వారి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఎస్పీ వినతులు తీసుకుని, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు భూ తగదాలు, రెండు కుటుంబాల తగదాలు, ఒకటి పరస్పర ఫిర్యాదులు వచ్చాయి.

ఎస్పీని కలిసిన పీపీ

వనపర్తి న్యూటౌన్ : ఎస్పీ రావుల గిరిధర్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం జిల్లా పోక్సో కోర్టు పీపీ శ్రీనివాసాచారి కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీపీలు, జిల్లా పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు బాధితులకు అండగా ఉండి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లాకోర్టు పీపీ గోపాల్ రెడ్డి, న్యాయవాది అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు వరద తాకిడి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జూరాల ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. గత రెండు రోజులుగా నిలకడగా కొనసాగిన వరద సోమవారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. దీంతో అధికారులు విద్యుత్తు ఉత్పత్తి కోసం నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు రెండు గేట్లు తెరిచి 14,128 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జూరాలకు 58,200 క్యూసెక్కుల నీరు వస్తోంది. కుడి కాలువకు 731 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1,030 క్యూసెక్కులతో పాటు జూరాల సమాంతర కాలువకు 400 క్యూసెక్కులు, బీమా ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 318.150 మీటర్ల స్థాయిలో 8.909 టీఎంసీల నీటిని నిల్వను రికార్డు చేస్తున్న అధికారులు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోలను పర్యవేక్షిస్తున్నారు.

కొత్త ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్


పల్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఇటీవల నియామక పత్రాలు అందుకున్న కొత్త ఉపాధ్యాయులకు ఈనెల 15వ తేదీన నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి, పాఠశాలలను కేటాయించేందుకు డీఈవోలు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించి, ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనికోసం ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సమాచారమిచ్చారు. ఇప్పటికే బదిలీ అయి పాత స్థానాల్లో కొనసాగుతున్న వారికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరగానే స్థానచలనం లభించనుంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు.

తీరనున్న సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత..

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు జులై మొదటి వారంలో పదోన్నతులపై స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు ఉపాధ్యాయులు) వచ్చినా కొరత పూర్తిగా తీరలేదు. ఉమ్మడి జిల్లాలో 260 మంది స్కూల్ అసిస్టెంట్లు కొత్తగా విధుల్లో చేరనున్న నేపథ్యంలో ఖాళీల సమస్య చాలా వరకు తీరనుంది.

16న విధుల్లోకి

556 మంది ఎస్జీటీలు..

ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో ప్రాథమిక పాఠశాలల్లో కొరత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 556 మంది ఎస్జీటీలు కొత్తగా విధుల్లో చేరనున్నారు. దీంతో తొలిమెట్టు కార్యక్రమం సక్రమంగా అమలు కానుంది. విద్యార్థుల సంఖ్య సైతం పెరిగే అవకాశముంది.

ఆటలకు ప్రాధాన్యం...

వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. వ్యాయామ విద్య ఎస్ఏలతో పాటు పీఈటీల ఖాళీలను భర్తీ చేయనుండడంతో విద్యార్థులు ఆటల్లో రాణిస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కానుండటంతో భాషపై పట్టు సాధిస్తారు.

భర్తీ కానున్న ఖాళీలు...

జిల్లా	ఎస్ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేటర్లు
మహబూబ్‌నగర్	35	22	07	144	06
నాగర్‌కర్నూలు	66	13	02	129	–
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణపేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు...



నాగర్‌కర్నూలు జిల్లాలో 210 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఒరిజినల్ నియామక పత్రాన్ని తీసుకొని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

ఆర్టీసీకి దసరా పండగ


వనపర్తి డిపో వద్ద బస్ కోసం ప్రయాణికుల ఎదురుచూపు

వనపర్తి పట్టణం, మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఆర్టీసీకి భారీగా రాబడి సమకూరింది. ఈనెల 1వ తేదీ నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ మంచి ఆదాయం రాబట్టింది. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని 10 డిపోల్లో రద్దీకి అనుగుణంగా దసరా పర్వదినానికి వచ్చే ప్రయాణికుల కోసం బస్సులు అందుబాటులో ఉంచి మంచి రాబడిని సాధించింది. ఈనెల 11న ఆర్టీసీకి భారీగా రాబడి వచ్చింది. మొత్తంగా 3.52 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిప్పిన సంస్థ 103.04 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో 4,60,727 మంది ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి రూ.2.17 కోట్ల రాబడి సాధించింది. 10న 3.50 లక్షల కి.మీ తిప్పి ఓఆర్ 100.59తో 4,45,159 మంది ప్రయాణికుల్ని చేరవేసి రూ.2.08కోట్లు రాబడి అందుకుంది. 9న 4,31,166 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చి రూ.1.97 కోట్ల రాబడి సాధించింది.

11న పరిస్థితి ఇలా..

డిపో	తిరిగిన కి.మీ(వేలల్లో)	ఓఆర్ (శాతం)	ప్రయాణికులు	రాబడి (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	0.55	103.18	60,295	34.21
వనపర్తి	0.47	108.03	66,343	29.94
గద్వాల	0.44	107.45	71,440	27.66
కల్వకుర్తి	0.41	103.81	48,744	24.57
నాగర్‌కర్నూల్	0.35	112.08	59,645	23.16
నారాయణపేట	0.36	96.51	39,217	21.29
అచ్చంపేట	0.33	101.60	36,989	20.10
షాద్‌నగర్	0.31	97.72	38,049	18.01
కొల్లాపూర్	0.28	94.79	32,741	15.77
కోస్గి	0.05	92.78	7,264	2.52

తిరుగు ప్రయాణంలో..: సొంతూళ్లలో ఉత్సాహంగా పండగ చేసుకున్న ప్రయాణికులు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తిరుగు ప్రయాణం కావడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు తరలి వెళ్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆదివారం నుంచి ఆర్టీసీ రీజియన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సోమవారం మహబూబ్‌నగర్ బస్టాండులో ఏ బస్సు చూసినా కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్నాయి. మరో రెండు రోజులు తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం వి.శ్రీదేవి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మొత్తం 9 డిపోల నుంచి 210 బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

104శాతం ఓఆర్‌తో రీజియన్ అగ్రస్థానం

మహబూబ్‌నగర్ పట్టణం: దసరా పండగను పురస్కరించుకుని ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి రాష్ట్రంలోనే అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 104శాతం సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం వి.శ్రీదేవి తెలిపారు. ఈనెల 1 నుంచి 11 వరకు ఉమ్మడి జిల్లాలోని పది డిపోల పరిధిలో వివిధ మార్గాల్లో బస్సులు నడిపి మంచి ఓఆర్ సాధించడంతో పాటు మూడు బస్ డిపోలు ఉత్తమ (కిలో మీటరుకు ఆదాయం) ఈపీకేతో పాటు ఓఆర్ అవార్డులకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ డిపో ఈపీకే రూ.67.1, ఓఆర్ 114.3%, వనపర్తి డిపో ఈపీకే రూ.65.35తో ఓఆర్ 110%, గద్వాల డిపో కిలోమీటరుకు రూ.63.67తో ఓఆర్ 108.62శాతం గడించిందని ఆర్ఎం తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులను, డ్రైవర్, కండక్టర్లను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించినట్లు పేర్కొన్నారు. దసరా తిరుగు ప్రయాణం రద్దీకి అనుగుణంగా ఈనెల 16 వరకు 210 బస్సులను హైదరాబాద్‌కు నడుపుతున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ 30, వనపర్తి 27, అచ్చంపేట 23, కొల్లాపూర్ 23, గద్వాల్ 22, కల్వకుర్తి 22, నారాయణపేట 22, షాద్‌నగర్ 21, నాగర్‌కర్నూల్ 20 బస్సులు నడుస్తాయన్నారు.

రైతేరాజు 6లో..

బీమా పథకాల అమలులో నిర్లక్ష్యమెందుకు : ఎంపీ మల్లురవి



మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, పాల్గొన్న వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : కేంద్రం అమలు చేస్తున్న బీమా పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బ్యాంకు మేనేజర్లపై నాగర్‌కర్నూల్ ఎంపీ, దిశ ఛైర్మన్ మల్లురవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఒక్కో బ్యాంకుకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన అంశాలపై లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిశోర్‌పాండే, ఆయా బ్యాంకుల మేనేజర్లను అడిగి తెలుసుకున్నారు. ముద్ర, కాల పరిమితి, ప్రాధాన్యత, అప్రాధాన్యతల వారీగా ఇవ్వాల్సిన రుణాలతో పాటు పంట రుణాల లక్ష్యాలు ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. వచ్చే సమావేశం నాటికి లక్ష్యం సాధించాలని సూచించారు. గైర్హాజరైన బాంకర్లకు తాఖీదులు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, వాటి మరమ్మతులకు ప్రతిపాదనలిస్తే నిధులు కేటాయిస్తామన్నారు. బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి డబ్బు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్తు తీగల తొలగింపు, కొత్త నియంత్రికలు, విద్యుత్తు ఉపకేంద్రాల్లో అవసరాలపై నివేదిక ఇవ్వాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ రాజశేఖరానికి ఆదేశించారు. ఈ నెల 22న నాగర్‌కర్నూల్‌లో జరిగే జాతీయ చిన్నపరిశ్రమలపై వర్క్‌షాప్‌నకు జిల్లా నుంచి సంబంధితాధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు. సంక్షేమశాఖల ద్వారా రాయితీ రుణాల పంపిణీపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధితాధికారులను ఆదేశించారు. సమావేశంలో వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, దిశ కమిటీ సభ్యులు వీరయ్య, గంధం ఆంజనేయులు, చిన్నమ్మ థామస్, వెంకటేశ్, శంకర్‌నాయక్, ధనలక్ష్మి, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, ఆయాశాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు కల్పనే

ఈనాడు, మహబూబ్‌నగర్: వానాకాలం పాలమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు లేక కర్షకులు నానా అవస్థలు పడుతున్నారు. పంట క్రయవిక్రయాలతో ఆదాయం వస్తున్నా.. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. యార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. పంట విక్రయించేందుకు ఇక్కడికి వచ్చే రైతులకు అవస్థలు తప్పడంలేదు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కోస్గి, గద్వాల, అలంపూర్, మదనాపురం, పెబ్బేరు, ఆత్మకూరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలో మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 18.65 లక్షల ఎకరాల సాధారణ సాగు ఉండగా 16.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వరి-7.64 లక్షల ఎకరాలు, పత్తి-6 లక్షలు, కందులు-1.31 లక్షలు, మొక్కజొన్న-81 వేలు, జొన్న- 32 వేలు, వేరుసెనగ-18 వేల ఎకరాల్లో సాగయ్యాయి. మరికొద్ది రోజుల్లో పంటలు చేతికి రానున్నాయి. ప్రస్తుతం మార్కెట్ యార్డులకు మొక్కజొన్న వస్తోంది. ఈ నెలాఖరులో కందులు, వేరుసెనగ, వరి కూడా వచ్చే అవకాశాలున్నాయి. యార్డుల్లో కనీస సదుపాయాల్లేక రైతులు ఇబ్బందులు పడటమేగాక గత రెండు, మూడేళ్లుగా ఇక్కడ పంటలకు సరైన ధర రాక తీవ్రంగా నష్టపోయిన వాళ్లూ ఉన్నారు.


మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న ఆరబెడుతున్న రైతు

అంతా ఒక్కటై.. : ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కయ్యి రైతుకు మంచి ధర రాకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల వీరికి అధికారుల నుంచి కూడా మద్దతు ఉండటంతో కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. సరైన ధరలు రాక కర్షకులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తిలోని ప్రధాన మార్కెట్ యార్డులతో పాటు పలుచోట్ల వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు తమను మోసం చేస్తున్నారని తరచూ ఆందోళనలు జరిగాయి. ఎక్కువగా మొక్కజొన్న, కందులు, ధాన్యం విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయి. మార్కెట్ యార్డుల్లో రైతులకు సరైన ధర వచ్చేలా మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా కౌంటర్లు వేసి పర్యవేక్షణ చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో ఏ మార్కెట్ యార్డులోనూ ఇది సక్రమంగా అమలు కావడం లేదు. మరి కొద్ది రోజుల్లో యార్డులకు పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే అధికారులు దృష్టి సారిస్తేనే రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి. దీనిపై మార్కెటింగ్‌శాఖ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ఏడీ బాలమణి 'ఈనాడు'తో మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు రైతులకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సౌకర్యాలు కల్పించాలి..

- రైతుల కోసం ప్రత్యేకంగా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి
- విశ్రాంతి కోసం ప్రత్యేక గదులను సిద్ధంగా ఉంచాలి
- ధాన్యం కోసం షెడ్డులను ఏర్పాటు చేయాలి
- రాత్రివేళల్లో ఇబ్బందుల్లేకుండా విద్యుత్తు సౌకర్యం కల్పించాలి
- ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి
- పంటకు మంచి ధర వచ్చేందుకు ఈ-నామ్ వ్యవస్థను అమలు చేయాలి.

జిల్లా	సాధారణ విస్తీర్ణం (ఎకరాల్లో..)	సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో)
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
నారాయణపేట	4,27,260	4,22,585
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
వనపర్తి	2,40,233	2,29,588
గద్వాల	3,37,011	2,95,340

వెక్కిరిస్తున్న క్రీడా ప్రాంగణాలు!

గ్రామీణ, పట్టణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ఒక్కో మైదానానికి కనిష్ఠంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. నిర్వహణ లేక కొన్ని చోట్ల క్రీడా పరికరాలకు తుప్పపట్టి పోగా.. మరికొన్ని చోట్ల వాటి అడ్రసు లేదు. మైదానాల్లో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగింది.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

పార్కింగ్ స్థలాలుగా..

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తిలో ఏర్పాటు చేసిన కొన్ని క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారి ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలాలుగా నిలిచాయి. పట్టణంలోని 25వ వార్డు పోలీసు నివాస గృహాల వెనుక ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. 31వ వార్డు కేడీఆర్ నగర్‌లో శిశుమందిర్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో సరైన వసతులు కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారింది. ఆ స్థలాన్ని కొందరు వాహనాల పార్కింగ్ స్థలంగా మార్చుకున్నారు. పుర కమిషనర్ పూర్ణచందర్‌ను సంప్రదించగా ఉపయోగంలో లేని క్రీడా ప్రాంగణాలను గుర్తించి వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు.


పిచ్చి మొక్కలతో 25వ వార్డు క్రీడా ప్రాంగణం

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



గోవిందహళ్లిలో చిన్న గుట్ట పక్కనే క్రీడా ప్రాంగణం

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని గోవిందహళ్లిలో ఊరికి దూరంగా గుట్ట పక్కనే ఏర్పాటు చేసిన క్రీడా మైదానానికి ఎవరూ వెళ్లడం లేదు. కొన్నూర్‌లో క్రీడామైదానం ఉన్న చోట విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణం చేశారు. రూ.70 వేలు నుంచి రూ.80 వేల వరకు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీవో ఉషనప్పను వివరణ కోరగా గ్రామానికి దూరంగా ఉన్న వాటిని గుర్తించి మరో చోటుకు తరలించి వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు.

నిధులు వృథా



సింగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గదికి తలుపుగా క్రీడాప్రాంగణం బోర్డు

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని మస్తీపూర్ గ్రామంలో అధికారులు రూ.3 లక్షలు వరకు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణం పనులు పూర్తి చేశారు. సదరు స్థలం ధరణిలో తనపేరు ఉందని ఓ వ్యక్తి వ్యవసాయం చేస్తున్నారు. సింగంపేట గ్రామంలో మహిళా సమాఖ్య భవనం పక్కన ఖాళీ స్థలంలో క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేశారు. భవనం, స్థలం తమది అని ఓ మహిళ వాదనకు దిగడంతో అధికారులు క్రీడా ప్రాంగణం బోర్డును గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. కిష్టంపల్లె గ్రామంలో డంపింగ్‌యార్డు పక్కన క్రీడా ప్రాంగణం పరికరాలు ఉండటంతో దుర్వాసన వస్తోందని ఎవరూ వెళ్లడం లేదు. ఈ విషయంపై ఎంపీవో నర్సింహయ్యను వివరణ కోరగా ఉపాధిహామీ పథకం ద్వార పనులు చేపట్టి గడ్డి మొక్కలు తొలగించి, మట్టి వేయించి సరి చేయిస్తాం.

సమగ్ర కుల గణనకు సిద్ధం

రెండు నెలల్లో నివేదికకు ఆదేశం



కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మరో సారి సామాజిక సమగ్ర సర్వేకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇంటింటికీ తిరిగి అన్ని కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్ని అంచనా వేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపిస్తామని స్పష్టతనిచ్చారు. 2014లో తొలి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టినప్పటికీ జిల్లాలవారీగా, కులాలవారీగా జనాభాను మాత్రం ప్రకటించలేదు. ప్రస్తుత సర్వేతో జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాల రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ గణన ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సర్వే నివేదికలు రెండు నెలల్లోపే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

ఉమ్మడి జిలాల్లో..: ఉమ్మడి జిల్లాలో 2014లో చేపట్టిన సమగ్ర సర్వేను పరిశీలిస్తే జనాభా 42,84,024 ఉండగా 9,67,013 కుటుంబాలు నివసిస్తున్నట్లు తేల్చారు. వీటిలో 5,80,208 కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు అర్హులు కాగా 25,70,412 మందిని ఆయా కుటుంబసభ్యులుగా తేల్చారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల జనాభాను పరిశీలిస్తే ఎస్సీలు 4,29,191, ఎస్టీలు 2,91,863 మంది ఉన్నట్లు తేల్చారు. పదేళ్లలో ఈ అంకెల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

లెక్కలు తేలితే...: బీసీల్లో వందకుపైగా కులాలు, ఉప కులాలు ఉన్నప్పటికీ ఉద్యోగ, రాజకీయ ప్రాధాన్య రిజర్వేషన్ల శాతం మాత్రం తక్కువగా ఉంటున్నట్లు ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. జనాభాలో సగాని కంటే ఎక్కువ ఉన్న తమకు అదే ప్రాతిపదికన తమకు ఫలాలు దక్కాలని గత కొన్నేళ్లుగా బీసీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వాదనను ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నినాదంగా మార్చుకున్నాయి. రాజకీయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 35 శాతం, విద్య ఉద్యోగావకాశాల్లో 29 శాతం రిజర్వేషన్లు దక్కుతుండటాన్ని ఆ వర్గం వ్యతిరేకిస్తోంది.

వార్డెన్స్ మరియు వంట మాస్టర్లు కావలెను
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాయ్స్ హాస్టల్లో పనిచేయడానికి ఇద్దరు వార్డెన్స్ మరియు వంట మాస్టర్లు కావలెను వివరాలకు సంప్ర.
వాగ్దేవి జూనియర్ కళాశాల 9640000462

జ్ఞాపకాల మదిలో..
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప.
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
సంప్రదించండి
మహబూబ్‌నగర్ : 8008709794, 8008882661, 8008550249
వనపర్తి : 8008709798 నాగర్‌కర్నూల్ : 8008705545
జోగులాంబ గద్వాల : 8008882662, నారాయణపేట: 7680076453

(c) eenadu



ఆరోగ్యం మన చేతిలోనే..!

సంపూర్ణ ఆరోగ్యానికి చేతుల శుభ్రత ఎంతో కీలకం. భోజనం చేసే ముందు, తుమ్మినా, దగ్గినా, రోగిక పరిస్థితులు చేశాక, ఆటలు ఆడిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం వల్ల చాలా రకాల వ్యాధులు దరి చేరవని వైద్యులు చెబుతారు. ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించే వారు లేకుండా పోయారు. ఫలితంగా చాలా మంది జబ్బుల బారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, రాజోలి, కోస్గి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3.20 లక్షల మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 1,500కి పైగా పాఠశాలల్లో చేతులు కడుక్కోవడానికి వీలైన కుళాయిలు అందుబాటులో లేవు. 1,099 పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనుల్లో భాగంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటికి నీటి సరఫరా లేదు. విద్యార్థులు మట్టిలో ఆడుకుని, అపరిశుభ్రత మధ్య మల, మూత్ర విసర్జన వెళ్తున్నారు. పాఠశాలల్లో సబ్బుల కొనుగోలుకు నిర్వహణ నిధుల్లో కేటాయిస్తున్నా... భోజనానికి ముందు వాటిని అందుబాటులో ఉంచడం లేదు. ఇలాంటి పరిస్థితి లేకుండా ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. సబ్బు తప్పనిసరిగా అందుబాటులో ఉంచడంతో పాటు, శుభ్రం చేసుకోకపోతే కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

నీకు తెలుసా

- సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల అతిసారాన్ని 30 శాతం మేర, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు 20 శాతం మేర తగ్గించవచ్చు.
- ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి చేతులు శుభ్రం చేసుకునే సౌకర్యం కొరవడిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.
- జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం దేశంలోని పౌరుల్లో 26 శాతం మంది మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవడం లేదు.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 శాతం పాఠశాలల్లో విద్యార్థులకు సబ్బులు అందుబాటులో ఉంచడం లేదు.

ఇలా చేద్దాం..



- ధారాళంగా వచ్చే కుళాయి నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తరువాత అర చేతులు, వేళ్ల మధ్య సబ్బు లేదా లోషన్‌తో రుద్దుకోవాలి.
- చేతుల వెనుక వైపునుంచి వేళ్ల మధ్య శుభ్రం చేసుకోవాలి.
- చేతులను ముని వేళ్లతో రుద్దుకోవాలి. బొటన వేళ్లను శుభ్రం చేసుకోవాలి.
- మణికట్టు వద్ద బాగా రుద్దుకొని ధారాళంగా వచ్చే నీటికింద ఉంచాలి.



కలిగే అనర్థాలు

- చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే తొందరగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- మట్టిలో ఆడుకుని శుభ్రం చేసుకోకపోవడం వల్ల నులి పురుగులు, బద్దె పురుగులు పిల్లల కడుపులో పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల రక్త హీనత ఏర్పడుతుంది.
- అపరిశుభ్ర చేతులతో ఆహారం తీసుకోవడం వల్ల అతిసారం, టైఫాయిడ్, పచ్చకామెర్లు, అంటువ్యాధులు, రక్త విరేచనాల బారిన పడే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



రాజోలి ప్రాథమిక పాఠశాలలు కుళాయిలు లేని నీటి ట్యాంకు..




తల్లిదండ్రులూ మీదే బాధ్యత

తల్లిదండ్రులు రోజూ పిల్లల చేతులు శుభ్రం చేయాలి. పాఠశాల నుంచి వచ్చిన వారికి, ఆటలు ఆడుకుని ఇంటికి వచ్చిన చిన్నారులు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. వారికి ఇదో అలవాటుగా మార్చాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి చెప్పాలి. మల విసర్జన అనంతరం సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. వ్యర్థాలను తాకినప్పుడు కూడా చేతుల శుభ్రత తప్పనిసరి.

- డా.భరత్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, గద్వాల ఆసుపత్రి

పిట్ట కొంచెం.. ఆదాయం ఘనం





షెడ్డులో కముజులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకుని వాటిని నిత్యాదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన యువ రైతు శివప్రసాద్. డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయంలో తండ్రికి సాయం చేస్తూ చేదోడు, వాదోడుగా ఉంటున్నారు. ఏటా వ్యవసాయంలో పెట్టుబడి మినహా లాభాలు రావడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో కముజుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెల రోజుల పాటు కముజు పిట్టల పెంపకం, దాణా, రోగనిరోధ శక్తి పెంపొందించడం వంటి పలు అంశాలపై శిక్షణ పొందారు.

అధికంగా ప్రోత్సహిస్తే..: ప్రస్తుతం చిన్న షెడ్‌లో కముజు పిట్టలను పెంచుతున్నారు. ప్రభుత్వం రుణం అందించి ప్రోత్సహిస్తే 5 వేల పిట్టలను సరిపడా షెడ్డు నిర్మించి, మరో ఐదుగురికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని.. జిల్లాలోని పలు దుకాణాలకు నేరుగా వీటిని తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రోత్సాహం అందిస్తే వ్యాపారంలో మరింతగా రాణిస్తా.
- శివప్రసాద్, రామకృష్ణాపురం

నెలకు నికర ఆదాయం : శిక్షణ అనంతరం శివప్రసాద్ గ్రామంలోనే చిన్న షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కముజుల కోసం రాజేంద్రనగర్‌లోని శిక్షణ కేంద్రం అధికారులను సంప్రదించారు. మొదటి విడతగా ఒకటి రూ. 10 చొప్పున 500 పిల్లలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వాటిని తీసుకురావడానికి రవాణా ఖర్చు రూ.2,500, దాణాకు రూ.8 వేలు, మందులు, ఇతర ఖర్చులకు రూ.1,500 మొత్తం రూ.17 వేలు ఖర్చయ్యాయి. కముజు పిల్లలను జాగ్రత్తగా సంరక్షించడంతో 45 రోజుల్లోనే 250 గ్రాముల బరువు పెరిగాయి. ఒక్కటి రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు. ఆర్డర్‌పై కిలో రూ.700 వరకు అమ్ముతున్నారు. ఖర్చులు మినహా 45 రోజులకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నికర ఆదాయం వస్తోంది.

కందిలో ఎండు తెగుళ్లు.. సస్యరక్షణ చర్యలు



తెగుళ్లతో ఎండిపోయిన మొక్కలు

మానవపాడు, న్యూస్‌టుడే : భారీ వర్షాలకు కందిపంటను ఎండుతెగులు ఆశించింది. చేసేదేమీ లేక కొందరు రైతులు పంటను పూర్తిగా తొలగించి, వేరే పంటలు సాగు చేస్తున్నారు. ఎండుతెగుళ్లతో పాటు పురుగుల నుంచి కంది పంటను ఎలా కాపాడుకోవాలి, తెగుళ్ల బారిన పడినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ పలు సూచనలు చేశారు.

నీటి యాజమాన్యం : పూత, కాత సమయాల్లో సరిపడా నీటితడులు అందించాలి. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా కంది పండుతుంది.

ఆకుచుట్టు పురుగు : ఆకులను ముడతలుగా చేసి పత్రహరితాన్ని పీల్చి వేస్తాయి. మొక్క ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. నివారణ చర్యగా ఒక లీటరు నీటిలో 1.6-1 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు : పూత, కాత సమయాల్లో ఆశిస్తుంది. కాయలకు రంధ్రాలు చేసి లోపల ఉన్న గింజలను తినేస్తుంది. పురుగు ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు ఒక లీటరు నీటికి 5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే పూత సమయంలో 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్, కాయ దశలో ఒక లీటరు నీటికి 1.5 ఎంఎల్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ మందు కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఎండుతెగులు : ఈ తెగులు వల్ల ఎదుగుతున్న మొక్కలు ఎండిపోతాయి. ఎండిన మొక్కలను వేరు నుంచి తొలగించాలి. దీని వల్ల వేరే మొక్కలకు తెగులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు. నివారణ చర్యగా ఒక లీటరు నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు కలిపి వేర్లు తడిచే విధంగా మొక్కల చుట్టూ పోయాలి.

కలుపు యాజమాన్యం

ఈ పంటకు కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. విత్తిన తర్వాత 2 రోజుల్లోపు లీటరు నీటికి పెండిమిథాలిన్ 5 మి.లీ. కలిపి నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. మొక్కలు ఎదుగుతున్న సమయంలో కలుపు నివారణ చర్యల్లో భాగంగా సాళ్ల మధ్య గుంటుక లేదా గొర్రుతో కలుపు తీయాలి. మొక్కలు నేలను కప్పి వేసే వరకు అంతరకృషి చేయాలి. మొక్కల మధ్య కలుపు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 ఎంఎల్ క్విజాలోఫాప్ మందు కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- నాగేశ్వర్‌రెడ్డి, పుట్టపల్లి

✓ లీటరు నీటిలో ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా స్పైనోశాడ్ 1 మి.లీ లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? వేరుశనగలో వేరుపురుగు నివారణకు తగిన చర్యలు తెలపండి.
- భాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు

✓ మొక్కల మొదళ్లలో 200 గ్రాముల ప్రొఫెనోఫాస్ 40% + సైపర్‌మెత్రిన్ 40% 40 లీటర్ల నీటిలో కలిపి పోయాలి. ఎకరాకు 6 కిలోల థయామెథాక్సామ్ 0.9% + ఫిప్రోనిల్ 0.2% గుళికలను ఇసుకలో కలిపి తేమ ఉన్నప్పుడు చల్లాలి.

? మిరపలో పై ముడత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- వెంకటస్వామి, రామన్‌పాడ్

✓ ఒక ఎకరాకు ప్రొఫెనోఫాస్ 400 మి.లీ లేదా డైఫెన్‌థయూరాన్ 300 గ్రాములు లేదా స్పైనోశాడ్ 75 మి.లీ లేదా ఫాసలోన్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, మదనాపురం



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం



పాతాళగంగ సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

వాహనాలతో కిక్కిరిసిన శ్రీశైలం రహదారి

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి దుర్గామాత నిమజ్జనం కోసం శ్రీశైలం వెళ్తున్న వాహనాలతో నల్లమలలోని ప్రధాన రహదారి కిక్కిరిసింది. నిమజ్జనం కోసం వచ్చిన వాహనాలను వంతెనపై నిలపడంతో శ్రీశైలం వచ్చిపోయే వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పాతాళగంగ పరిసరాల్లో ట్రాఫిక్‌ను ఈగలపెంట పోలీసులు క్రమబద్ధీకరించారు.

మిల్లులో రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్, పోలీసులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లులో రేషన్ బియ్యం పట్టుబడాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ నందకిశోర్ తెలిపిన వివరాల మేరకు మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లూరు రాజు, పుల్లూరు వెంకటేశ్ సోమవారం ఉదయం ఓమ్ని వాహనంలో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకుని ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లుకు తరలించి వాహనం నుంచి సంచులు దింపుతుండగా సీసీఎస్ పోలీసులు (ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు) పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను ఎస్సై సురేశ్ గౌడ్‌కు అప్పగించారు. సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్ చేరుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. 30 గన్ని బ్యాగులు, 8 ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని వనపర్తిలోని పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని రేషన్ షాప్ డీలర్ చంద్రశేఖర్ వద్ద కిలో రూ.15 చొప్పున కొని నవ్య దివ్య రైస్ మిల్లర్‌కు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వారిపై, రైస్ మిల్ నిర్వాహకుడు పాలవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

18న అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ కోసం ముందస్తుగా నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లను ఈ నెల 18న పిల్లల మర్రిదారిలోని ఎండీసీఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ సోమవారం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులతో మొత్తం ఆరు జట్లుగా విభజించి వారి మధ్య ఈనెల 21 నుంచి 28 వరకు టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభావంతులతో అండర్-23 ఉమ్మడి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి అండర్-23 క్రికెట్ టోర్నీ నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తెల్లటి క్రీడా దుస్తులతో హాజరుకావాలని సూచించారు.

భూ రికార్డులు తారుమారు చేశారంటూ.. ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం



రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజకీయ అండదండలు బలంగా ఉన్న బడా రైతులు ప్రభుత్వం తమకిచ్చిన భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి వారి పేర్లు ఎక్కించుకున్నారని ఆరోపిస్తూ రైతు పరశురాముడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో పోలీసులు, సిబ్బంది అడ్డుకుని ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు.

బాధిత కుటుంబ సభ్యులు తిమ్మప్ప, కృష్ణల కథనం ప్రకారం.. అయిజ మండలం యాపదిన్నె శివారులోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డే సవారన్నకు ప్రభుత్వం 1986లో సర్వే నంబర్ 321లో 5 ఎకరాల భూమిని మంజూరు చేసింది. ఆయన మృతిచెందిన తర్వాత వారసత్వంగా ముగ్గురు కుమారులు పరశురాముడు, తిమ్మప్ప, కృష్ణ పేరున ఖాతా మార్పు చేయాలని గత కొన్నేళ్లు నుంచి అయిజ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆ మూడు కుటుంబాలు జీవనోపాధి కోసం కడప ప్రాంతానికి వలస వెళ్లారు. తిరిగి గ్రామానికి వచ్చేసరికి వారసత్వంగా కుటుంబానికి సంక్రమించాల్సిన భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు బడా నాయకులు కబ్జా చేసి వారి పొలంలో కలిపేసుకున్నారు. ఇదీ అన్యాయమంటూ పలుమార్లు అయిజ తహసీల్దార్ కార్యాలయంలో మా భూమిని సర్వే చేసి హద్దు చూపించాలని దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయింది. గతంలో ఒక సారి సర్వే అధికారులు వచ్చినా బడా నేతలు బెదిరించడంతో వారు వెళ్లిపోయారు. దీంతో పిల్లాపాపలతో సహా కలెక్టర్‌కు తమ గోడు వినిపించడానికి వచ్చామని వారు వివరించారు. తమ అన్న పరశురాముడు ఆ బాధతోనే ఆత్మహత్యకు యత్నించారని తెలిపారు. అధికారులు తమ భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా బాధిత రైతు గత జులై 1న కూడా ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

అటవీ శాఖకు వాహనం అందజేత



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ట్రస్టీ అనిల్‌కుమార్ వి ఏపూర్

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పులుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణకు 'వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్' సంస్థ కట్టుబడి ఉందని ఆ సంస్థ ట్రస్టీ, హైదరాబాద్ కార్యాలయ ఛైర్మన్ అనిల్ కుమార్ వి ఏపూర్ అన్నారు. అమ్రాబాద్ పెద్ద పులుల అభయారణ్యానికి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బొలెరో వాహనాన్ని పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరకు అందజేశారు. మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణుల వేటను నియంత్రించేందుకు వాహనం ఉపయోగపడుతుందని చెప్పారు. ఏటీఆర్‌లో పులుల సంరక్షణకు ఫ్లాష్ లైట్లు, మెటల్ డిటెక్టర్లు, జీపీఎస్ సిస్టంలు, ఇతర సామగ్రి అందించామని వివరించారు. ఏటీఆర్ ఎఫ్‌డీ శివాని డోగ్రా, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరీదా టంపాల్, ఎఫ్‌డీవో రామమూర్తి, ఎఫ్ఆర్వోలు గురుప్రసాద్, మహేందర్, చంద్రశేఖర్, దేవజ, డీఆర్వో రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటం

28.5 తులాల బంగారం ఆభరణాల చోరీ



బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగకు వచ్చిన ప్రయాణికుల బ్యాగులను దొంగలు తమ చేతివాటంతో తస్కరించారు. దీంతో ముగ్గురు బాధితులకు చెందిన 28.5 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ నెల 9 నుంచి దసరా పండగ కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాకపోకలు సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లడానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో నాలుగు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఇదే అదునుగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. దొంగలను నియంత్రణ చేయడానికి పోలీస్ శాఖ 20 మంది ఏఆర్ పోలీస్ సిబ్బందిని నియమించినా దొంగలు తమ తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బంగారం, ఇతర ఆభరణాలు పోగొట్టుకున్న పలువురు బాధితులు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

14 తులాల బంగారం మాయం...: హైదరాబాద్‌లో ఉంటున్న నరేశ్ మిలటరీలో పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. దసరా పండగకి తన సొంతూరుకు వెళ్లడానికి ఈనెల 9న హైదరాబాద్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. అక్కడ నుంచి పరిగి వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి ఊరెళ్లాడు. ఈనెల 11న తన బ్యాగును చూసుకోగా అందులో 14 తులాల బంగారం, 60 తులాల వెండి కనిపించలేదు. దీంతో ఆయన సోమవారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇజాజోద్దీన్ తెలిపారు.

8 తులాల బంగారం..: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్‌కు చెందిన సలుగుట్టి సుధారాణి పండగకి మహబూబ్‌నగర్‌కు వచ్చింది. అనంతరం సోమవారం తన ఇంటికి వెళ్లడానికి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌కు వచ్చింది. సాయంత్రం రాయచూర్ బస్సు ఎక్కింది. అనంతరం తన బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు కోసం చూడగా చిన్న పర్సు కనిపించలేదు. వెంటనే బస్సు దిగి చుట్టూ పక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందులో 8 తులాల బంగారం ఉందని, వాటిని వెతికి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

మహిళా హోంగార్డు బంగారం చోరీ...: హైదరాబాద్‌లోని చింతలబస్తీలో నివాసం ఉంటున్న మహిళా హోంగార్డు కోస్గీ సువర్ణ సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద విధులు నిర్వర్తిస్తోంది. ఈ నెల 12న పండకి గండీడ్ మండలం కొంరెడ్డిపల్లికి వచ్చింది. అనంతరం సోమవారం తిరిగి ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ బస్సు ఎక్కింది. ఆమె చేతిలో ఉన్న బ్యాగు చూసుకుంటే జిప్ తెరిచి ఉంది. వెంటనే ఆ బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. వెంటనే ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం



శిరీష

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వరకట్న వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బిజినేపల్లి మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన శిరీష (23)ను 2018లో బిజినేపల్లి మండలం సల్కర్‌పేట గ్రామానికి చెందిన తిరుపతయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం కోసం భర్త తరచుగా వేధించడంతో పెద్దలు పలుమార్లు నచ్చజెప్పారు. ఈనెల 8న మరోమారు భర్తతోపాటు అత్త సుదర్శనమ్మ వివాహితను వేధించి, దాడికి పాల్పడ్డారు. మనస్తాపంతో శిరీష అదేరోజు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతదేహంపై గాయాలు ఉన్నాయని, న్యాయం చేయాలని తండ్రి ఆంజనేయులు బిజినేపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. శిరీషకు ఇద్దరు కుమారులు. భర్త తిరుపతయ్య, అత్త సుదర్శనమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



హరిలాల్

బాలానగర్, న్యూస్‌టుడే: పొలంలో పశువులు మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హరిలాల్(44) సోమవారం ఉదయం పొలంలో విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరు దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిరుమలదేవుని గుట్టకు చెందిన బండి రాజు (35) ఆదివారం రాత్రి టీడీగుట్ట రైల్వే గేట్ వద్ద పట్టాలు దాటుతున్న క్రమంలో హంద్రీ ఎక్స్‌ప్రెస్ తగలడంతో కిందపడటంతో తల రోడ్డుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి చెవులు సరిగ్గా వినపడవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులోకి దూకి మహిళ ఆత్మహత్య



అలివేలు

అడ్డాకుల, న్యూస్‌టుడే : చెరువులో దూకి మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మూసాపేట మండలం పోల్కంపల్లిలో చోటుచేసుకుంది. మూసాపేట ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు... పోల్కంపల్లికి చెందిన సుందరయ్య కుమార్తె అలివేలు(34)ను మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విటల్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం, కుటుంబ కలహాల కారణంగా 3 నెలల నుంచి అలివేలు తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించిన ఆమె సోమవారం కనిపించలేదు. స్థానిక రైతులు చెరువులో మహిళా మృతదేహం ఉన్నట్టు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా అలివేలుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	148–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

EENADU Classifieds

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I A Gowriprasad S/O Gangadhar R/o 1-1-25, Singar Bese Narayanpet, Po Narayanpet, Mahabubnagar, Telangana- 509210, Have Changed My Name To Gowri Prasad. For All Future Purposes

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. ✆ 7995365999.

పద్మప్రియ ఆటో ఫైనాన్స్ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అడ్రస్: 2వ ఫ్లోర్, SSR టవర్స్, పద్మావతి కాలనీ, మ.నగర్ సెల్: 93964 46448, 91009 01857

REAL ESTATE

LEASE/ RENT

లీజుకు ఇవ్వబడును మహబూబ్‌నగర్ టౌన్‌కు దగ్గరగా కోస్గి రోడ్డులో 3000 గజాల ఓపెన్ ప్లాటు లీజుకు ఇవ్వబడును సంప్ర. ✆ 98857 90612

FACULTY/ TEACHERS

Wanted English Teacher in School upto 7th. Contact: 88976 44222

JOBS

Medical Representatives Required urgently. Work @ Mahabubnagar Ph: 70326 40251 E: cortexlabspvtltd@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మదనాపురం : 8074538150 వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 వీపనగండ్ల : 9121229043

సమస్య : పట్టణంలోని భగత్‌సింగ్ కూడలి నుంచి ఆత్మకూరు వైపు వెళ్లే రహదారి మలుపులో వర్షపు నీరు నిలుస్తోంది. రహదారి బురదమయంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడుతున్నారు.



- అజయ్, అమరచింత

సమాధానం : భగత్‌సింగ్ కూడలిలో రహదారి మలుపులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించి మట్టి తొలగింపజేస్తాం. **- వి.మంగమ్మ, పుర అధ్యక్షురాలు అమరచింత**

– న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర.** వెంకటేశ్వర: **మార్టిన్ (ఉదయం, సెకండ్‌షో), మా నాన్న సూపర్‌హీరో (మ్యాట్నీ, ఫస్ట్‌షో)** శ్రీరామా: **వేట్టయన్.**

రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు!

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాలని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని దత్తయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లి నూనె, పట్టీల (చిక్కీ) తయారీ పరిశ్రమ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. 2018లో అప్పటి కలెక్టర్ శ్వేతామహంతి ఇక్రిశాట్ అధికారులు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పరిశ్రమ ఏర్పాటు చేశారు. చిన్న పరిశ్రమల ఉపాధి కింద గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెండు రకాలుగా నిధులు అందించారు. వాటిలో ఐడబ్ల్యూఎంపీ (ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం) కింద రూ.25.34 లక్షలు, సీబీఎఫ్ (సెంట్రల్ బ్యాంకింగ్ ఫైనాన్స్) కింద మరో రూ.20.01 లక్షలు కలిపి మొత్తం రూ.45.35 లక్షలతో ఈ పరిశ్రమ ఏర్పాటు చేశారు. కలెక్టర్ చొరవతో మొదట్లో పల్లీపట్టీలు తయారు చేసి జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలకు సరఫరా చేశారు. గ్రామంలోని మహిళలకు, ఆపరేటర్లకు ఉపాధి కల్పించారు. పరిశ్రమ ఏర్పాటు చేసిన తొలినాళ్లలో మంచి ఫలితాలొచ్చాయి. అనంతరం ఏర్పాటు వచ్చింది.



మండలంలోని దత్తయిపల్లిలో మూతబడిన పల్లి నూనె పరిశ్రమ

పునరుద్ధరణకు యత్నం : నిర్వహణ లోపంతో అనుకున్న లక్ష్యం చేరడంలో వెనకబడిపోయాం. ప్రస్తుతం మహిళా సమాఖ్యకు అప్పజెప్పాలని, జిల్లా కేంద్రానికి తరలించి పరిశ్రమను నడిపించాలని ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం వీటిలో ఒక్క నూనె తయారీ యంత్రం మాత్రమే ఉపయోగంలో ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొత్త తరహా యంత్రాలు వచ్చాయి. ఇప్పటికీ మండల సమాఖ్య ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రదర్శనల్లో పల్లీ నూనె ప్రదర్శిస్తున్నాం.



- పి.ఉమాదేవి, డీఆర్డీవో

నిర్వహణను పట్టించుకోకపోవడంతో పరిశ్రమ మూతబడింది.

అవగాహన లేకనే.. : ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభించిన పరిశ్రమను మండల సమాఖ్య అధికారుల అవగాహన లోపంతో పల్లీ కొనుగోలు, మార్కెట్ అంచనాలపై ప్రణాళిక సరిగా లేకపోవడం, యంత్ర నిర్వహణపై సరైన అవగాహన లేక పోవడంతో రూ.లక్షలు వెచ్చించి చేసిన పరిశ్రమ మూతపడే పరిస్థితికి వచ్చింది. మొదట్లో పల్లీ నాణ్యతగా ఉండటంతో తెలంగాణ ఆయిల్ ఫెడ్ వారు ఆర్డర్లు చేశారు. కొంత కాలం తర్వాత నాణ్యత లోపించడంతో ఆర్డర్లు క్యాన్సిల్ అయ్యాయి. ఇది కాకుండా పల్లీ పట్టీలు తయారు చేసే యంత్రాలు చెడిపోవడంతో వాటిని బాగు చేయించేందుకు ముందుకు రాలేదు. దీనికి తోడు కరోనా రావడంతో నిర్వాహకులు ఆస్తకి కనబర్చకపోవడంతో పూర్తిగా మూసి వేశారు.

మందు పిచికారీతో ఎండిన పంట


వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అంకూర్ గ్రామంలో రైతు వేణుస్వామి ఐదెకరాల్లో వరి సాగు చేశారు. పంటకు సుడిదోమ, కంకినల్లి వ్యాపించడంతో వనపర్తిలోని ఓ ఎరువుల దుకాణంలో పురుగు నివారణ మందులను ఈ నెల 10వ తేదీన కొనుగోలు చేశారు. వాటిని పంటకు పిచికారీ చేసిన మరుసటి రోజున పంట మొత్తం ఎర్రబడి వాడి పోతోందని రైతు తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారికి సమాచారం ఇవ్వడంతో మండల వ్యవసాయాధికారి కురుమయ్యతో కలిసి పంట పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ రైతు తీసుకొచ్చిన మందులు సరైనవిగా ఉన్నాయని, పంట ఎందుకు వాడిపోతోందో పరిశీలిస్తున్నామని తెలిపారు. సంబంధిత కంపెనీ వారికి కూడా సమాచారం ఇచ్చామని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులకు కూడా సమాచారం అందించామని పేర్కొన్నారు.



ఎర్రబడిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కురుమయ్య

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం పాతబజార్‌కు చెందిన మహ్మద్ బురానుద్దీన్ అనారోగ్యానికి గురవడంతో వైద్యానికి ఆర్థికసాయం చేసేందుకు ఆయన ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీని సోమవారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు ఎండీ.రహీమ్ ఉన్నారు.



రూ.2.50లక్షల ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఆసుపత్రికి స్థల పరిశీలన

కొత్తకోట,న్యూస్‌టుడే: కొత్తకోట పట్టణంలో ఏర్పాటు చేయనున్న 50 పడకల ఆసుపత్రికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో దాతలు ఇచ్చిన 550 సర్వేనంబర్లో ఎకరం స్థలం ఉన్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, స్థల దాతలు తెలపడంతో సోమవారం ఈ కార్యక్రమానికి వెళ్లి ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు సీడీసీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, బోయజ్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



మండల పరిషత్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

మాల, మాదిగల సమన్యాయానికి కృషి : ఎంపీ మల్లురవి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: మాల మాదిగ, తమకు రెండు కళ్లలాంటివారని, వర్గీకరణ విషయంలో రెండు కులాలకు సమన్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ మల్లురవి అన్నారు. సోమవారం ఈ సమావేశానికి వచ్చిన ఆయనను జైభీమ్‌సంఘ, మాలమహానాడు, నాగర్‌కర్నూల్ మాలమహానాడు గర్జన కమిటీ సభ్యులు కలిశారు. అనంతరం ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లో జరిగే మాలల మహాగర్జన గోడపత్రికను ఎంపీతో పాటు మాలల సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆయా సంఘం నాయకులు కంటె నిరంజనయ్య, మద్దిలేటి, కృష్ణయ్య, కర్రయ్య పాల్గొన్నారు.



వనపర్తిలో మాలల మహాగర్జన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ మల్లురవి, ఆయా సంఘాల నాయకులు

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలో హజరత్ మహబూబ్ సుభాని దర్గా గంధోత్సవం సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. జెండాను మంగళ వాయిద్యాలతో రాజావలి దర్గా, పెద్ద పీర్ల మసీదు మీదుగా దర్గా వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ప్రార్థనలు చేసి మిఠాయిలు అందజేశారు. మంగళవారం ఉర్సు సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం ఉంటుంది. దర్గా నిర్వాహకులు జిలానీ, సోను దర్గాను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.



విద్యుత్తు దీపాల వెలుగుల్లో మహబూబ్ సుభాని దర్గా

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

కొత్తకోట,న్యూస్‌టుడే: కొత్తకోట పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేయాలని పుర ఛైర్ పర్సన్ సుకేశిని కోరారు. సోమవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో అధికారులు ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో 30 వేల జనాభా ఉందని, పాఠశాలలు మాత్రం విద్యార్థులకు అనుకూలంగా లేవని సర్వశిక్ష అభియాన్ ద్వారా మిగిలిపోయిన భవనాలను పూర్తి చేయించాలన్నారు. ఏడాదిగా పుర పాలికకు నిధులు రావడం లేదని, స్వచ్ఛమిషన్ నిధులు కేటాయించాలని, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజనలో వికలాంగులకు 30 ఇళ్లను (గృహ నిర్మాణం) మంజూరు చేయాలని కోరారు.

పొలాల చుట్టూ విద్యుత్తు కంచె వేస్తే చర్యలు : ఎస్పీ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు పొలాల చుట్టూ విద్యుత్తు వైర్లతో కంచె ఏర్పాటు చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు. ఈ కంచె వల్ల ప్రజలు, పశువులు చనిపోతున్నాయని తెలిపారు. బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. కంచె ఏర్పాటు చేసి ఇతరులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.

భాజపా దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : భాజపా జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మ్యాతరి శివశంకర్‌కు సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నారాయణ నియమాక పత్రం అందజేసి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ తప్పక గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. రాష్ట్ర, జిల్లా భాజపా నాయకులు శ్రీశైలం, సీతరాములు, అక్కలరామన్‌గౌడ్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు

కొత్తకోట (గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే సురక్షితమైన ప్రసవాలు జరుగుతాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జయచంద్రమోహన్ పేర్కొన్నారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం కమాలొద్దీన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్యలతకు ఆదివారం రాత్రి స్టాఫ్ నర్సు పుష్ప సాధారణ ప్రసవం చేశారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆస్పత్రికి వచ్చి వైద్యురాలిని అభినందించారు. ప్రైవేట్ ఆస్పత్రుల వైపు మొగ్గు చూపుతున్న వేళ ఓ వైద్యురాలు పీహెచ్‌సీలో ప్రసవం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆయన వెంట వైద్యురాలు ఆసియా, శ్రీలక్ష్మి, పర్యవేక్షకురాలు ప్రమీల, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



వైద్యురాలిని అభినందిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.జయచంద్రమోహన్

డీయస్సీ విజేతలకు సన్మానం

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన లోడె సింధు, గోకం ప్రియాంక ఇటీవల వెలువడిన డీయస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించడంతో పొదుపుసంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మోటూరి చంద్రమల్లయ్య, ఎస్సై రాములు, ఉపాధ్యాయుడు ఆవుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన మనీషా, రాము అనే డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని గ్రామపెద్దలు అన్నారు. స్థానిక దామోదర్‌రెడ్డి మెమోరియల్ పాఠశాలలో చదివిన వీరిని సోమవారం పాఠశాల పూర్వవిద్యార్థులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణతో విద్య నేర్పిన రామ్మూర్తిని గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు అచ్యుతరామారావు, ఆర్.వెంకటయ్య, జాంప్లానాయక్, గండి ఆంజనేయస్వామి దేవాలయ ఛైర్మన్ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు కేటీఆర్ చేయూత

వీపనగండ్ల(గ్రామీణం), న్యూస్‌టుడే : ఎంబీబీఎస్ విద్య అభ్యసించడానికి ఫీజు చెల్లించలేక విద్యార్థిని పడుతున్న ఇబ్బందులకు భారాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన బొరెల్లి నరసింహ, శ్యామలమ్మ దంపతుల కుమార్తె బొరెల్లి గౌరీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో సీటు లభించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో కళాశాలలో ఫీజు చెల్లించడానికి దాతలు ముందుకు రావాలని ప్రతిక ముఖంగా, ఎక్స్ వేదికగా కేటీఆర్‌ను ఆమె తల్లిదండ్రులు కోరారు. అందుకు ఆయన స్పందించడంతో గ్రామానికి చెందిన రాముడు సోమవారం విద్యార్థినితో పాటు ఆమె తల్లిదండ్రులను కేటీఆర్ వద్దకు తీసుకెళ్లగా ఆయన రూ.1.64 లక్షలు చెక్కును అందజేశారు.



కేటీఆర్‌తో విద్యార్థిని, కుటుంబ సభ్యులు

ఇప్టూ విలీన గోడపత్రికల విడుదల

అమరచింత, న్యూస్‌టుడే : ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే టీయూసీఐలో ఇప్టూ విలీన కార్యక్రమ గోడపత్రికలను సోమవారం అమరచింతలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇప్టూ జిల్లా కోశాధికారి సి.రాజు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే విలీన సభకు కార్మికులు అధికసంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో ఇప్టూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో తాత్కాలిక పద్ధతిలో అకౌంటెంట్, ఏఎన్ఎం ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు. అమరచింత, రేవల్లి, పెద్దమందడి, ఖిల్లాఘన్‌పూర్ కేజీబీవీల్లో ఏఎన్ఎం.. ఆత్మకూర్, రేవల్లి, పెద్దమందడి కేజీబీవీల్లో అకౌంటెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏఎన్ఎంకు ఇంటర్మీడియట్, అంకౌటెంట్ ఉద్యోగానికి బీకామ్ విద్యార్హత ఉండాలని సూచించారు. ఈనెల 15 నుంచి 21 వరకు వనపర్తి డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలు http://deowanaparthy.weebly.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

జల విద్యుదుత్పత్తికి 36వేల క్యూసెక్కులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద వరద నీరు కొనసాగుతున్న క్రమంలో జలవిద్యుత్ ఉత్పత్తికి 36,826 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎగువన ఐదు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గడిచిన 24 గంటల్లో ఎగువన 3.717, దిగువన 3.922 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగలిగారు. ప్రస్తుత వర్షాకాలం జలవిద్యుత్ ఉత్పత్తి ఎగువన 264.857, దిగువన 243.381 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

ఆత్మకూరులో ఆచార్య సాయిబాబాకు ఘన నివాళి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మానవ హక్కుల ఉద్యమనేత దివంగత సాయిబాబాకు సోమవారం మధ్యాహ్నం ఆత్మకూరు గాంధీచౌక్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ప్రసాద్, సీపీఎం నాయకులు మహిమూద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీహరి, సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్ తదితరులు మాట్లాడారు. వామపక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో సాయిబాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అమరచింత, న్యూస్‌టుడే : మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు అని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.విజయరాములు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, రవీందర్, కుతుబ్ పాల్గొన్నారు.





అమరచింత : నిమజ్జనంలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు.. పెబ్బేరు : వాసవీమాతా ఉత్సవ విగ్రహం

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

అమరచింత, న్యూస్‌టుడే : దేవినవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ప్రతిరష్ఠించిన దుర్గాదేవి విగ్రహాన్ని సోమవారం రాత్రి పట్టణ విధుల్లో ఊరేగించారు. చిన్నారులు, మహిళలు ఆట, పాటలతో నృత్యాలు చేశారు. ఆ సంఘం పెద్దలు రాజేష్, రఘురాం, సురేందర్‌జీలు ఏర్పాట్లు పరిశీలించారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవీమాతా ఉత్సవ విగ్రహ నిమజ్జన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి హోమాలు చేసి, అలంకరించిన వాహనంపై వాసవీమాతా విగ్రహాన్ని ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. శోభాయాత్రలో మహిళలు ఆడిన బతుకమ్మ పుర ప్రజలను ఆకట్టుకుంది.

కాళికాలయంలో ఒడి పూజ మహోత్సవం

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీకాళికాలయంలో సోమవారం ఆలయ ధర్మకర్త మండలి ఛైర్మన్ కె.నాగేశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కాళికా మాతకు ఒడి పూజ మహోత్సవం నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన చీరలను భక్తులు వేలం పాటలో తీసుకున్నారు. కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు వి.మంగమ్మ, నిర్వాహకులు రాములు, రమేశ్, సత్తి, రాజు, కృష్ణారెడ్డి, మనోహర్‌రాజు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రంలో అధికమొత్తంలో వసూళ్లు

మదనాపురం : మదనాపురంలోని మీ సేవా కేంద్రం నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల మదనాపురానికి చెందిన బోయ వెంకటన్న పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోడానికి మీ సేవా కేంద్రానికి వెళ్లారు. ఇందుకు రూ.1,200 ఖర్చు అవుతోందని కేంద్రం నిర్వాహకుడు చెప్పారు. ఇదే పనిని కొత్తకోటలో రూ.100 పూర్తి చేసుకున్నారు. పది రోజుల కిందట వడ్డె వెంకటేశ్ ఆధార్ కార్డులో తప్పులు సరిచేసుకోవడానికి వెళ్లగా రూ.మూడు వేలు అవుతోందని కేంద్రం నిర్వాహకులు చెప్పారని బాధితుడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ అబ్రహం లింకన్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువగా డబ్బు తీసుకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం స్థానిక ఏపీజీవీబీ బ్యాంకు ముందు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాబార్డు ఏజీఎం మనోహర్‌రెడ్డి, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డిలు ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాల గురించి వివరించారు. మోసపూరితమైన ఫోన్‌కాల్స్‌ను గుర్తించి 1930 కి కాల్‌చేసి విషయాన్ని చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు శ్రీనివాసయాదవ్, ఫీల్డ్ ఆఫీసర్లు సంజీవరావు, అఖిల్, క్యాషియర్ అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారులతో ప్రమాణం చేయిస్తున్న నాబార్డు అధికారులు

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిఫెన్స్ లీగల్‌ఎడ్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. సోమవారం మండలంలోని సవాయిగూడెంలో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధ భూములు, మోటారు వాహన చట్టం, సైబర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, మాజీ ఉపసర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సవాయిగూడెంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డిఫెన్స్ లీగల్‌ఎడ్ కౌన్సిల్ ఉత్తరయ్య

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

చిన్నంబావి, న్యూస్‌టుడే : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన చంద్రారెడ్డి(50)కి గతంలోనే భార్య మృతి చెందారు. అతనికి ఇద్దరూ కుమార్తెలు ఉండగా వారికి వివాహం అయ్యింది. దీంతో ఒంటరిగా ఉండలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉరేసుకున్నారు. స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందడంతో కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాగుపాముతో భయంభయం

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన శివమ్మ సోమవారం పొలంలో మినుములు వేయడానికి ట్రాక్టర్‌తో పొలం దున్నిస్తున్నారు. ఈక్రమంలో నాగుపాము ట్రాక్టర్ ముందు పడగవిప్పి బుస కొడుతుండగా అది చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఆమె స్థానిక యువకుడు పరమేశ్‌కు ఫోన్ చేసి చెప్పారు. అతను వనపర్తి స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. 40 నిమిషాల పాటు పాము ఉండటంతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. కృష్ణసాగర్ చాకచక్యంగా పట్టుకుని వనపర్తి సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే : పెద్దమందడికి చెందిన కానిస్టేబుల్ శివ తల్లి అలివేలమ్మ సోమవారం గుండెపోటుతో మృతి చెందగా సమాచారంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దమందడికి చెందిన ఆయున్నిసాబేగం ఈ నెల 12న మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను, మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన నాగరాజు 11న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని బండారునగర్‌లో యాదగిరి (42) ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని ఎస్సై జయన్న తెలిపారు. కొత్తకోటకు చెందిన యాదగిరి, మాధవి కుటుంబసభ్యులతో బంగారునగర్‌లో నివాసం ఉంటున్నారు. పట్టణంలోని ఓ పెట్రోల్‌బంక్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న బాధిత తండ్రి కొండన్న సోమవారం సాయంత్రం తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటకు చెందిన రాజు అనే వ్యక్తి వనపర్తికి వెళ్లి వస్తానని ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య వసంత సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

విజేత జట్లకు బహుమతుల ప్రదానం

అమరచింత, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో 4రోజుల పాటు అమరచింత క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. టోర్నీలో 16 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గ్రౌండ్ టీం, గణేష్ నగర్ జట్లు తలపడ్డాయి. 38 పరుగుల తేడాతో గ్రౌండ్ టీం ప్రథమ బహుమతిగా రూ.8,888లు, జ్ఞాపిక.. గణేష్‌నగర్ ద్వితీయ బహుమతిగా రూ.5,555లు జ్ఞాపిక అందుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, నాయకులు శ్యామ్, ప్రకాశ్, బషీత్‌ఖాన్, సాయి గౌడ్, దిలిప్ పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న గ్రౌండ్ టీం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లాగణపురం మండల పరిధి వెంకటాంపల్లి గ్రామ శివారులో సుష్మా స్వరాజ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా భాజాపా మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను అందజేశారు. శివక్రిష్ణ జట్టుకు మొదటి బహుమతిగా రూ.9వేలు రెండవ బహుమతిగా రూ. 6వేలను తిరుమలాయ పల్లికి చెందిన నాని జట్టు, మూడో వెంకటాంపల్లి గోపాల్‌రెడ్డి క్రికెట్ జట్టు రూ. 3వేలను గెలుచుకున్నాయి.



మాట్లాడుతున్న మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

ఆటలతోనే క్రీడాకారుల్లో స్నేహభావం



విజేతకు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఆటల పోటీలతోనే క్రీడాకారుల మధ్య మంచి స్నేహభావం పెంపొందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పాన్‌గల్‌లో దసరా సందర్భంగా తాళ్ల శిరీష జ్ఞాపకార్థం నిర్వహించిన పీపీఎల్ క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతగా నిలిచిన ఫ్రెండ్స్ లెవన్‌కు, రన్నర్‌గా నిలిచిన శివాజీ లెవన్ జట్లకు జ్ఞాపిక, నగదు అందజేశారు. నిర్వాహకులు సింగోటం, గ్రామస్థులు వెంకటస్వామి, నారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో.. : మండలంలోని గోప్లాపూర్‌లో నిర్వహించిన జీపీఎల్-3 క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి దాతలు పుల్లారావు, రాజుగౌడ్, ప్రసాద్‌గౌడ్, బాలస్వామి బహుమతులు అందజేశారు.

(c) eenadu